रजिस्ट्री सं. डी-221
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి-221

मूल्य रु. 8.00 पैसे
[Price Rs. 8.00 Paise.
మూల్యము : రూ. 8.00 పైసలు

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १. | नई दिल्ली | सोमवार | ८ अप्रैल, २०१३/१४ | फाल्गुन | खंण्ड २२ |
| **No.1** | **New Delhi** | **Monday** | **8 April, 2013/14** | **Phalgun** | **Vol. 22** |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | సోమవారము | 8 ఏప్రిల్, 2013/14 | ఫాల్గుణ | సంపుటము 22 |

MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 04th February, 2013/Magha, 1934 Nandana.

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Transplantation of Human Organs Act, 1994 (Act No.42 of 1994), (2) The Airports Authority of India Act, 1994 (Act No.55 of 1994), (3)The Airports Economic Regulatory Authority of India Act, 2008 (Act No. 27 of 2008) and (4) The Gram Nyayalayas Act, 2008 (Act No. 4 of 2009) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

F-1

## శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

### (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) మానవ అవయవముల మరియు కణజాలముల మార్పిడి చట్టము, 1994 (1994లోని 42వ చట్టము), (2) భారత విమానాశ్రయముల ప్రాధికార సంస్థ చట్టము, 1994 (1994లోని 55వ చట్టము), (3) భారత విమానాశ్రయముల ఆర్థిక క్రమబద్ధీకరణ ప్రాధికార సంస్థ చట్టము, 2008 (2008లోని 27వ చట్టము) మరియు (4) గ్రామ న్యాయాలయముల చట్టము, 2008 (2009లోని 4వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# మానవ అవయవముల మరియు కణజాలముల మార్పిడి చట్టము, 1994

1994లోని 42వ చట్టము.

[1994, జూలై 8]

*చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు మానవ అవయవములను మరియు కణజాలములను తొలగించుట, నిల్వచేయుట మరియు మార్పిడిచేయుటను క్రమబద్ధము చేయుటకును మరియు మానవ అవయవములతో మరియు కణజాలములతో వాణిజ్య వ్యవహారములను నివారించుటకును మరియు దానికి సంబంధించిన లేక ఆనుషంగికమైన విషయములను నిబంధించుటకైన చట్టము.*

చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు మానవ అవయవములను మరియు కణజాలములను తొలగించుట, నిల్వచేయుట మరియు మార్పిడి చేయుటను క్రమబద్ధము చేయుటకు మరియు మానవ అవయవములతో మరియు కణజాలములతో వాణిజ్య వ్యవహారములను నివారించుటకు వినియమమును నిబంధించుటకు ఉపయుక్తముగా ఉన్నందుననూ; మరియు

సంవిధానము యొక్క 249 మరియు 250వ అనుచ్ఛేదములలో నిబంధించబడినట్లు తప్ప, పైన పేర్కొనబడిన ఏదేని విషయములకు సంబంధించి రాజ్యముల కొరకు శాసనములను చేయుటకు పార్లమెంటుకు అధికారము లేనందుననూ; మరియు

సంవిధానము యొక్క 252వ అనుచ్ఛేదపు (1)వ ఖండమును అనుసరించి, పైన పేర్కొనబడిన విషయములకు సంబంధించి గోవా, హిమాచల్ ప్రదేశ్ మరియు మహారాష్ట్ర రాజ్య శాసనమండలుల సదనములచే చేయబడిన తీర్మానములను శాసనము ద్వారా పార్లమెంటుచే క్రమబద్ధము చేయవలసియున్నందుననూ;

భారత గణరాజ్యము యొక్క నలుబది ఆయిదవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - 1

## ప్రారంభిక

సంగ్రహనామము, వర్తింపు మరియు ప్రారంభము.

1.(1) ఈ చట్టమును మానవ అవయవములు మరియు కణజాలముల మార్పిడి చట్టము, 1994 అని పేర్కొన వచ్చును.

(2) ఇది, ప్రధమతః గోవా, హిమాచల్‌ప్రదేశ్ మరియు మహారాష్ట్ర రాజ్యములన్నింటికిని మరియు సంఘ రాజ్య క్షేత్రములన్నింటికిని వర్తించును మరియు సంవిధానము యొక్క 252వ అనుచ్ఛేదపు ఖండము (1) క్రింద ఈ విషయములలో చేయబడిన తీర్మానము ద్వారా ఈ చట్టమును అట్టి ఇతర రాజ్యము అవలంభించిన యెడల దానికి కూడా వర్తించును.

(3) ఇది గోవా, హిమాచల్‌ప్రదేశ్ మరియు మహారాష్ట్ర రాజ్యములలోను మరియు సంఘ రాజ్య క్షేత్రములన్నింటిలోను కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన మరియు సంవిధానము యొక్క 252వ అనుచ్ఛేదపు ఖండము (1) క్రింద ఈ చట్టమును అమలుపరచు ఏదేని ఇతర రాజ్యములో అట్టి అవలంబించిన తేదీన అమలు లోనికి వచ్చును; మరియు ఏదేని రాజ్యము లేక సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి ఈ చట్టము యొక్క ప్రారంభమునకైన ఏదేని నిర్దేశమునకు అట్టి రాజ్యము లేక సంఘ రాజ్య క్షేత్రమునందు ఈ చట్టము అమలులోనికి వచ్చు తేదీ అని అర్థము.

నిర్వచనములు.

2. ఈ చట్టములో, సందర్భమును బట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప,-

(ఎ) "ప్రకటన" అను పదమునందు, సాధారణముగా ప్రజలకు లేక ప్రజలలో ఏదేని వర్గమునకు లేక వ్యక్తిగతముగా ఎంపికచేసిన వ్యక్తుల కొరకు ఏ రూపములోనైననూ చేయు ప్రకటన చేరియుండును;

(బి) "సముచిత ప్రాధికారి" అనగా 13వ పరిచ్ఛేదము క్రింద నియమింపబడిన సముచిత ప్రాధికారి అని అర్థము;

(సి) "ప్రాధికారమునొసగు కమిటీ" అనగా 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) యొక్క ఖండము (ఎ) లేదా ఖండము (బి) క్రింద సంఘటితము చేయబడిన కమిటీ అని అర్థము;

(డి) "మస్తిష్కమూల మరణము" అనగా మస్తిష్కమూలము యొక్క కృత్యములన్నియు శాశ్వతముగా మరియు తిరిగి పనిచేయకుండా ఆగిపోయి, 3వ పరిచ్ఛేదము యొక్క ఉప- పరిచ్ఛేదము (6) క్రింద ఆ విధముగా ధృవీకరింపబడినట్టి దశ అని అర్థము;

(ఇ) "మృతిచెందిన వ్యక్తి" అనగా ప్రాణముతో జన్మించిన పిమ్మట ఎప్పుడైననూ మస్తిష్కమూల మరణము కారణముగా లేక కార్డియో పల్మనరీ వలన శాశ్వతముగా ప్రాణము కోల్పోవుట సంభవించిన వ్యక్తి అని అర్థము;

(ఎఫ్) "దాత" అనగా పదునెనిమిది సంవత్సరములకు తక్కువకాని వయస్సు కలిగి 3వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (1) లేక ఉప-పరిచ్ఛేదము (2) క్రింద చికిత్సాపరమైన ప్రయోజనాల కొరకు ఏవేని తన మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండునూ తొలగించుటకు స్వచ్ఛందముగా ప్రాధికారమిచ్చు ఎవరేని వ్యక్తి అని అర్థము;

(జి) "ఆసుపత్రి" అను పదమునందు నర్సింగ్ హోమ్, చికిత్సాలయము, వైద్య కేంద్రము, చికిత్సాపరమైన ప్రయోజనాల కొరకైన వైద్య లేక బోధన సంస్థ మరియు అటువంటి ఇతర సంస్థ చేరియుండును;

(హెచ్) "మానవ అవయవము" అనగా జీవకణాల నిర్మాణపు ఏర్పాటుతో కూడి-యుండి, పూర్తిగా తొలగించబడిన యెడల శరీరము ద్వారా రూపొందింపబడని మానవ శరీరము యొక్క ఏదేని భాగము అని అర్థము;

(హెచ్-ఎ) "మానవ అవయవముల పునఃసంపాదన కేంద్రము" అనగా,-

(i) మరణము సంభవించిన సందర్భములో అవయవములను దానము చేయగల సమర్థ దాతలైన రోగుల తీవ్ర అస్వస్థతకు చికిత్స చేసేందుకు తగినన్ని సౌకర్యములు కలిగివున్న; మరియు

(ii) మానవ అవయవముల పునఃసంపాదన కొరకు 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్టరైన

ఆసుపత్రి అని అర్థము;

(హెచ్-బి) "మైనరు" అనగా పదునెనిమిది సంవత్సరముల వయస్సు నిండని వ్యక్తి అని అర్థము;

(ఐ) "దగ్గరి బంధువు" అనగా భర్త లేక భార్య, కుమారుడు, కుమార్తె, తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, తాత, తల్లి యొక్క తల్లి లేదా తండ్రి యొక్క తల్లి, మనుమడు లేదా మనుమరాలు అని అర్థము;

(జె) "అధిసూచన" అనగా అధికారిక రాజపత్రములో ప్రచురింపబడిన అధిసూచన అని అర్థము;

(కె) "చెల్లింపు" అనగా డబ్బులేక డబ్బుతో సమానమైన విలువగల దానితో చేయు చెల్లింపు అని అర్థము, అయితే ఇందులో-

(i) సరఫరా చేయబడు మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు, రవాణా చేయుటకు లేక భద్రపరచుటకు అగు ఖర్చును; లేక

F-2

(ii) అతని శరీరము నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని అతను సరఫరా చేయుటకు యుక్తముగాను మరియు ప్రత్యక్షము గాను సంబంధించినదనదగిన మేరకు ఒక వ్యక్తికి అయిన ఏవేని ఖర్చులను లేక సంపాదనలోని నష్టములను;

భరించుటకు లేక రాబట్టుకొనుటకు చేయు ఎటువంటి చెల్లింపు చేరియుండదు.

(యల్) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా విహిత-పరచిన అని అర్థము;

(యమ్) "గ్రహీత" అనగా ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని ఎవరికి మార్పిడి చేయబడినదో లేక మార్పిడి చేయుటకు ప్రతిపాదించబడినదో ఆ వ్యక్తి అని అర్థము;

1956లోని 102వ కేంద్ర చట్టము.

(ఎన్) "రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు" అనగా భారత వైద్య పరిషత్తు చట్టము, 1956లోని 2వ పరిచ్ఛేదపు ఖండము (హెచ్)లో నిర్వచింపబడినట్లుగా ఏదేని గుర్తించబడిన వైద్య అర్హత కలిగియున్న మరియు ఆ పరిచ్ఛేదము యొక్క ఖండము (కె)లో నిర్వచింపబడి నట్లుగా రాజ్య వైద్య రిజిస్టరులో నమోదు చేయబడిన వైద్య వృత్తిదారు అని అర్థము;

(ఒ) "చికిత్సాపరమైన ప్రయోజనములు" అనగా ఏదేని వ్యాధికి క్రమబద్ధముగా చికిత్సచేయుట లేక ఏదేని ప్రత్యేక పద్ధతి లేక విధానముననుసరించి ఆరోగ్యమును మెరుగు పరచుటకు తీసుకొనవల్సిన చర్యలు అని అర్థము;

(ఒ-ఎ) "కణజాలము" అనగా రక్తము మినహా మానవ దేహములో ప్రత్యేకమైన కృత్యములను నిర్వర్తించు కణముల సముదాయము అని అర్థము;

(ఒ-బి) "కణజాలముల బ్యాంకు" అనగా కణజాలములను తీసుకొనుట, స్క్రీనింగ్, పరీక్షించుట, ప్రాసెసింగు, నిలువ చేయుట మరియు పంపిణీలకు సంబంధించిన ఏదేని కార్యకలాపమును నెరవేర్చుటకు 14-ఏ పరిచ్ఛేదము క్రింద రిజిస్టరు చేయబడిన ఒక సౌకర్యము అని అర్థము, అయితే ఇందులో బ్లడ్ బ్యాంకు చేరియుండదు;

(పి) "మార్పిడి" అనగా చికిత్సాపరమైన ప్రయోజనముల నిమిత్తము జీవించి వున్న ఎవరేని వ్యక్తి నుండి లేక మరణించిన వ్యక్తి నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ తీసి జీవించియున్న మరొక వ్యక్తికి అమర్చుట అని అర్థము;

(క్యూ) "మార్పిడి సమన్వయకర్త" అనగా మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటిని తొలగించుటకు లేదా మార్పిడి చేయుటకు సంబంధించిన అన్ని

విషయములలో సమన్వయపరచుట కొరకు మరియు 3వ పరిచ్ఛేదము యొక్క నిబంధనల ననుసరించి మానవ అవయవముల తొలగింపు కొరకు ప్రాధికారికి సహాయపడుట కొరకు ఆసుపత్రిచే నియమించబడిన వ్యక్తి అని అర్థము;

## అధ్యాయము - 2
## మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెంటిండినీ తొలగించుటకు ప్రాధికారము

మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటి తొలగింపుకు ప్రాధికారము.

3.(1) ఎవరేని దాత, తాను మరణించక ముందు, చికిత్సాపరమైన ప్రయోజనముల నిమిత్తము తన శరీరములోని ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు విహితపరచబడునట్టి రీతిలోను మరియు అట్టి షరతులకు లోబడి ప్రాధికారమీయ వచ్చును.

(1-ఏ) విహితపరచబడునట్టి మానవ అవయవములను లేక కణజాలములను లేక రెండింటిని తొలగించు, నిల్వచేయు లేక మార్పిడి చేయు ప్రయోజనము కొరకు అట్టి మార్పిడి సమన్వయకర్త లభ్యమైనచో, అట్టి మార్పిడి సమన్వయ కర్తతో సంప్రదించిన మీదట,-

(i) ఇన్ టెన్సివ్ కేర్ విభాగములో చేర్చబడిన వ్యక్తి నుండి లేక అతని దగ్గరి బంధువు నుండి అట్టి వ్యక్తి తన మరణమునకు ముందు ఏ సమయము లోనైనను తన శరీరములోని ఏదేని అవయవమును లేక కణజాలమును లేక రెండింటిని తొలగించుటకు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రాధికారమిచ్చి నాడా అను దానిని తెలుసుకొని, అప్పుడు విహితపరచబడునట్టి రీతిలో అట్టి ప్రాధికారము కొరకైన దస్తావేజును పొందుటకు ఆసుపత్రి ఉపక్రమించుట;

(ii) అట్టి వ్యక్తిచే ఉప-పరిచ్ఛేదము (2) క్రింద నిర్దేశించబడినట్టి ప్రాధికార మొసగబడనపుడు, మానవ అవయవములు లేక కణజాలములు లేక రెండింటిని దానమిచ్చుటకై ప్రాధికారమొసగుటకు లేక నిరాకరించుటకైన అభిమతమును తెలుపుట కొరకు అట్టి వ్యక్తిని లేక అతని దగ్గరి బంధువును జాగృతపరచుట;

(iii) ఖండము (i) మరియు (ii)ల క్రింద గుర్తింపబడిన దాత యొక్క మానవ అవయవములు లేక కణజాలములు లేక రెండింటిని తొలగించు, నిల్వచేయు లేక మార్పిడి చేయుట కొరకు మానవ అవయవముల పునఃసంపాదన కేంద్రమునకు, విహితపరచబడునట్టి రీతిలో ఆసుపత్రికి వ్రాతమూలకముగా తెలియపరచుట,

ఆసుపత్రిలో పనిచేయుచున్న రిజిష్ట్రీకృత వైద్యవృత్తిదారుని కర్తవ్యమై యుండును.

(1-బీ) మానవ అవయవములు లేక కణజాలములు లేక రెండింటి తొలగింపు, నిల్వ చేయు లేక మార్పిడి చేయు ప్రయోజనముల కొరకు ఈ చట్టము క్రింద రిజిస్ట్రీకృతము కాని ఆసుపత్రిలోని ఇన్‌టెన్సివ్ కేర్ విభాగములో పనిచేయు చున్న రిజిస్ట్రీకృత వైద్యవృత్తిదారుని విషయములో కూడ విహితపరచబడు నట్టి తేదీ నుండి ఉప-పరిచ్ఛేదము (1-ఏ) యొక్క ఖండములు (i) నుండి (iii)ల క్రింద పేర్కొనబడిన కృత్యములు వర్తించును.

(2) ఎవరేని దాత, తాను మరణించక ముందు ఎప్పుడైనను, చికిత్సాపరమైన ప్రయోజనముల నిమిత్తం తాను మరణించిన తరువాత, తన శరీరములోని ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు వ్రాత మూలకముగాను మరియు ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది సాక్షుల (వీరిలో కనీసము ఒకరు అట్టి వ్యక్తికి దగ్గర బంధువై యుండవలెను) సమక్షములో స్పష్టంగా ప్రాధికారమిచ్చినచో, ఆ దాత యొక్క మృత దేహమును శాసన సమ్మతముగా స్వాధీనమునందు కలిగియున్న వ్యక్తి, పైన చెప్పిన ప్రాధికారమును దాత తదుపరి ప్రతిసంహరణ చేసికొనినట్లు విశ్వసించుటకు కారణమున్ననే తప్ప, చికిత్సాపరమైన ప్రయోజనాల నిమిత్తం దాత యొక్క మృతదేహము నుండి ఆ మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటినీ తొలగించుటకు సబబైన అన్ని సౌకర్యములను రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారుకు కలుగజేయవలెను.

(3) ఎవరేని వ్యక్తి, తన మరణమునకు ముందు పరిచ్ఛేదము (2)లో పేర్కొనినట్టి ప్రాధికారమీయనపుడు, అయితే, చికిత్సాపరమైన ప్రయోజనముల నిమిత్తము తన మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటిని తాను మరణించిన తరువాత ఉపయోగించుటకు ఏ అభ్యంతరమునూ వ్యక్తపరచనిచో, అట్టి వ్యక్తి యొక్క మృత దేహమును శాసన సమ్మతముగా తన స్వాధీనమునందు కలిగియున్న వ్యక్తి, ఆ మృత వ్యక్తి యొక్క దగ్గర బంధువు ఎవరైనా, మృత వ్యక్తి దేహము యొక్క మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ చికిత్సాపరమైన ప్రయోజనముల నిమిత్తము వాడబడుటకు అభ్యంతరము కలిగియున్నాడని విశ్వసించిననే తప్ప, ఆ మృత వ్యక్తి దేహము నుండి చికిత్సాపరమైన ప్రయోజనములకు వాడుటకై ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు ప్రాధికారమీయవచ్చును.

(4) ఉప-పరిచ్ఛేదము (1) లేక ఉప-పరిచ్ఛేదము (2) లేక, సందర్భానుసారముగా ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ఇచ్చిన ప్రాధికారము, చికిత్సాపరమైన ప్రయోజనాల నిమిత్తం మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు తగిన అధికార పత్రముగా ఉండును, అయితే అట్టి తొలగింపు ఏదియు రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు కానట్టి ఏ వ్యక్తి చేయరాదు:

"అయితే, విహితపరచబడునట్టి అర్హతలు మరియు అనుభవమును కలిగియున్న సాంకేతిక నిపుణుడు కార్నియాను సమూలముగా తొలగించవచ్చును.";

(5) మరణించిన వ్యక్తి యొక్క శరీరము నుండి ఏదేని మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటినీ తొలగించునపుడు, ఏ శరీరము నుండి అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటినీ తొలగించవలసి వున్నదో, అట్టి శరీరముల ప్రాణము లేదని లేక అది మస్తిష్కమూల మరణముగా తోచినపుడు, అట్టి మరణము ఉప-పరిచ్ఛేదము (6) క్రింద ధృవీకరించబడినదని అట్టి తొలగింపునకు ముందు రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు స్వయముగా పరీక్షించి రూఢి చేసుకొనవలెను.

(6) మస్తిష్కమూల మరణం వలన వ్యక్తి దేహము నుండి ఏదేని అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటినీ తొలగించునప్పుడు, అట్టి మరణము ఈ క్రింది వారితో కూడిన వైద్య నిపుణుల మండలిచే విహితపరచబడినట్టి ప్రరూపములోను, అట్టి రీతిగాను ధృవీకరించబడిననే తప్ప మరియు అట్టి షరతులు మరియు ఆవశ్యకములను పాటించిననే తప్ప, అట్టి తొలగింపును చేయరాదు. ఆ మండలి సభ్యులెవరనగా:-

(i) మస్తిష్కమూల మరణము ఏ ఆసుపత్రిలో సంభవించినదో ఆ ఆసుపత్రికి ఇన్-ఛార్జిగానున్న రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు;

(ii) సముచిత ప్రాధికారి ఆమోదించిన పేర్ల జాబితా నుండి, ఖండము (i)లో నిర్దిష్టపరచిన రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారుచే నామనిర్దేశము చేయు విశేషజ్ఞుడైనట్టి ఒక స్వతంత్ర్య రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు;

(iii) సముచిత ప్రాధికారి ఆమోదించిన పేర్ల జాబితా నుండి, ఖండము (i)లో నిర్దిష్టపరచిన రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు నామనిర్ధేశము చేయు న్యూరో-లజిస్టు లేక న్యూరో సర్జను:

"అయితే, న్యూరాలజిస్టు లేక న్యూరో సర్జను లభ్యముకానపుడు, రిజిస్ట్రీకృత వైద్యవృత్తిదారుడు సర్జను లేక ఫిజీషియను మరియు ఎనస్తిటిస్టు లేక ఇంటెన్సివిస్ట్ అయిన ఒక స్వతంత్ర రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారుని వారు సంబంధిత గ్రహీత కొరకైన మార్పిడి బృందము యొక్క సభ్యులు కాదను షరతుకు మరియు విహితపరచబడునట్టి షరతులకు అధ్యధీనమై నామనిర్దేశము చేయవచ్చును;

(iv) మస్తిష్కమూల మరణము సంభవించిన వ్యక్తికి చికిత్స చేసిన రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు.

(7) ఉప-పరిచ్ఛేదము (3)లో ఏమిఉన్నప్పటికినీ, పద్దెనిమిది సంవత్సరముల లోపు వయస్సుగల ఎవరేని వ్యక్తికి మస్తిష్కమూల మరణము సంభవించి మరియు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద ధృవీకరించబడిన యెడల, మరణించిన వ్యక్తి యొక్క తల్లిదండ్రులలో

F-3

ఎవరైనను మరణించిన వ్యక్తి దేహము నుండి ఏదేని మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెంటినీ తొలగించుటకు విహితపరచబడునట్టి ప్రరూపములోనూ మరియు అట్టి రీతిలోనూ ప్రాధికారమునీయవచ్చును.

మానవ అవయములు లేదా కణజాలములు లేదా రెండింటి తొలగింపుకు కొన్ని సందర్భములలో ప్రాధికారమునీయకుండుట.

4.(1) తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము యొక్క నిబంధనలను అనుసరించి మరణించిన వ్యక్తి దేహము విషయములో మరణ విచారణ జరుపవలసి యున్నదని సదుపాయములను మంజూరుచేయు లేదా ప్రాధికారమును ఇచ్చు వ్యక్తి విశ్వసించుటకు తగిన కారణమున్నచో మరణించిన అట్టి దేహము నుండి ఏవేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు 3వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఎట్టి సదుపాయములను మంజూరు చేయరాదు మరియు ఆ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ఎట్టి ప్రాధికారమును ఈయరాదు.

(2) సమాధిచేయుటకు, దహనం చేయుటకు లేదా ఇతరత్రా వ్యయనము చేయు నిమిత్తం మరణించిన వ్యక్తి దేహమును ఏ వ్యక్తికైతే అప్పగింపబడునో ఆ వ్యక్తి మరణించిన వ్యక్తి శరీరము నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ లేదా తొలగించుటకు ఎలాంటి ప్రాధికారమును ఈయరాదు.

ఆసుపత్రిలో లేదా కారాగారములో క్లెయిము చేయబడని శరీరముల నుండి మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండింటిని తొలగించుటకు ప్రాధికారము.

5.(1) ఒక ఆసుపత్రిలో లేక కారాగారములో ఉన్న మృత దేహమును సదరు వ్యక్తి మరణానంతరము 48 గంటల లోపల మరణించిన వ్యక్తి దగ్గరి బంధువులలో ఎవరు క్లెయిము చేయని సందర్భములో తత్సమయమున ఆసుపత్రి లేదా కారాగార నిర్వహణకు, నియంత్రణకు ఇన్-ఛార్జిగా వున్న వ్యక్తిచే లేదా ఆసుపత్రి లేదా కారాగార నిర్వహణ లేదా నియంత్రణకు ఇన్‌ఛార్జిగా వున్న వ్యక్తిచే ఈ విషయమున ప్రాధికారము పొందినట్ట ఆసుపత్రి లేదా కారాగారము యొక్క ఉద్యోగి విహితపరచిన ప్రరూపములో ఆవిధంగా క్లెయిము చేయబడకుండా ఉన్న మృత దేహము నుండి ఏదేని మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటిని తొలగించుటకు ప్రాధికారమును ఈయవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్దిష్టపరచబడిన సమయము లోపల మరణించిన వ్యక్తి దేహమును క్లెయిము చేయుటకు ఆ మరణించిన వ్యక్తి తాలూకు దగ్గరి బంధువులు ఎవరు రానప్పటికినీ, మరణించిన వ్యక్తి దేహమును క్లెయిము చేయుటకు అతని దగ్గరి బంధువు ఎవరైనా రావచ్చునని విశ్వసించుటకు కారణము ఉన్నచో, ప్రాధికారము ఇచ్చుటకు అధికారమున్న వ్యక్తి, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఎట్టి ప్రాధికారము ఈయరాదు.

వైద్య-న్యాయపరమైన లేదా రోగ నిర్ధారణ నిమిత్తం శవ పరీక్ష కొరకు పంపబడిన శరీరముల నుండి మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండింటిని తొలగించుటకు ప్రాధికారము.

6. మరణించిన వ్యక్తి యొక్క దేహాన్ని,-

(ఎ) ప్రమాదము లేదా ఏదేని ఇతర అసహజమైన కారణముచే అట్టి వ్యక్తికి మరణము సంభవించినందున వైద్య న్యాయపరమైన ప్రయోజనముల నిమిత్తము లేదా

(బి) రోగ నిర్ధారణ నిమిత్తం,

శవపరీక్ష కొరకు పంపబడినప్పుడు అట్టి మృత దేహము నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకుగాను ఈ చట్టము క్రింద ప్రాధికారమిచ్చుటకు సమర్థత కలిగిన వ్యక్తి, ఏ ప్రయోజనము నిమిత్తం ఆ మృత దేహము శవ పరీక్షకై పంపబడినదో ఆ ప్రయోజనమునకు అట్టి మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటి అవసరము లేదని విశ్వసించుటకు కారణమున్న యెడల, మృతదేహము నుండి ఆ మానవ అవయమును లేదా కణజాలమును లేదా రెండింటిని, చికిత్సాపరమైన ప్రయోజనాల నిమిత్తం తొలగించుటకు ప్రాధికారమును ఈయవచ్చును. అయితే, అట్లు ప్రాధికారమిచ్చు వ్యక్తి ఆ మరణించిన వ్యక్తి తన మరణమునకు ముందు, తన మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెంటింటినీ తన మరణానంతరము చికిత్సాపర మైన ప్రయోజనముల కొరకు వాడుటకు అభ్యంతరము వ్యక్తపరచలేదని లేదా ఆ వ్యక్తి తన మరణానంతరము తన మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండింటినీ చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు ఉపయోగించుటకు ప్రాధికారము ఇచ్చియుండి, మరణానికి పూర్వము అట్టి ప్రాధికారమును ప్రతిసంహరించుకోలేదని రూఢీచేసుకొనవలెను.

మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండింటిని భద్రపరచుట.

7. ఎవరేని వ్యక్తి మృత దేహము నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించిన పిమ్మట, రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు, అట్లు తొలగింపబడిన మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటిని విహిత పరచబడిన విధంగా భద్రపరచుటకు అన్ని చర్యలు తీసుకొనవలెను.

వ్యావృత్తులు.

8.(1) ఒక మృతవ్యక్తి దేహముతో లేక దేహము యొక్క ఏదేని భాగముతో చేయు ఏదేని వ్యవహారము ఈ చట్టము పాస్ చేయబడకుండినచో శాసనమాన్యత కలిగియుండెడి-దైన యెడల, ఈ చట్టములో పైన పేర్కొన్న ఏవేని నిబంధనలలో ఉన్నదేదియూ శాసన విరుద్ధము చేయునదిగా భావించరాదు.

(2) ఈ చట్టపు నిబంధనలననుసరించి, మరణించిన వ్యక్తి దేహము నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకు ఏదేని సౌకర్యమును లేదా ప్రాధికారమును మంజూరుచేయుటగాని, అట్టి ప్రాధికారమును అనుసరించి, మరణించిన వ్యక్తి దేహము నుండి మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటిని తొలగించుటగాని, భారత శిక్షాస్మృతి, (1860లో 45వది)లోని 297వ పరిచ్ఛేదము క్రింద శిక్షార్హమైన అపరాధముగా భావించరాదు.

1860లోని 45వది.

మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండింటి తొలగింపు మరియు వాటిని మార్పిడి చేయుటపై నిర్బంధనలు.

9(1). ఉప-పరిచ్ఛేదము (3)లో ఇతర విధముగా నిబంధింపబడిననే తప్ప, దాత, గ్రహీతకు దగ్గరి బంధువు అయిననే తప్ప, దాత మరణమునకు ముందు అతని శరీరము నుండి మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించి, గ్రహీత శరీరమునకు మార్పిడి చేయరాదు.

(1ఏ) దగ్గరి బంధువైనట్టి దాత లేక గ్రహీత విదేశీ జాతీయుడైనపుడు, మానవ అవయవము లేక కణజాలము లేక రెండింటి తొలగింపు లేక మార్పిడికి ముందు, ప్రాధికారమునొసగు కమిటీ యొక్క పూర్వానుమతి అవసరమగును:

అయితే ప్రాధికారమునొసగు కమిటీ, గ్రహీత ఒక విదేశీ జాతీయుడు మరియు దాత ఒక భారత జాతీయుడైనచో, వారు దగ్గరి బంధువులైననే తప్ప, అట్టి తొలగింపు లేక మార్పిడికి అనుమతించరాదు.

(1బీ) విహితపరచబడు రీతిలోనైననే తప్ప, మార్పిడి ప్రయోజనము కొరకు మైనరు యొక్క మరణమునకు ముందు అతని శరీరము నుండి మానవ అవయవములను లేక కణజాలములను లేక రెండింటిని తొలగించరాదు.

(1సీ) మార్పిడి ప్రయోజనము కొరకు మానసిక లోపం గల వ్యక్తి యొక్క మరణమునకు ముందు అతని శరీరము నుండి మానవ అవయవములను లేక కణజాలములను లేక రెండింటిని తొలగించరాదు.

విశదీకరణ:- ఈ ఉప-పరిచ్ఛేదము యొక్క ప్రయోజనము కొరకు, -

(i) "మానసిక లోపంగల వ్యక్తి" అను పదబంధములో మానసిక అనారోగ్యము లేక సందర్భానుసారముగా మానసిక మాంద్యము చేరియుండును;

(ii) "మానసిక అనారోగ్యము" అను పదబంధములో చిత్తవైకల్యము, మానసిక అస్వస్థత మరియు ఒక వ్యక్తిని బుద్ధిపరంగా అశక్తునిగా చేయు ఇతర మానసిక స్థితి చేరియుండును;

(iii) "మానసిక మాంద్యము" అను పదబంధము అశక్తతతో కూడిన వ్యక్తుల (సమాన అవకాశములు, హక్కుల రక్షణ మరియు పూర్తిగా పాల్గొను) చట్టము, 1995 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (ఆర్)కు ఇవ్వబడిన అదే అర్థమును కలిగియుండును.

1996లోని 1వది.

(2) ఎవరేని దాత, తన మరణము తరువాత తన యొక్క ఏవేని మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండునూ తొలగించుటకుగాను 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రాధికారమిచ్చినపుడు, లేదా ఎవరేని మరణించిన వ్యక్తి దేహము నుండి ఏదేని మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటిని

తొలగించుట కొరకు ప్రాధికారము ఇచ్చు సమర్థత లేదా ప్రాధికారము కలిగివున్న ఎవరేని వ్యక్తి అట్టి తొలగింపుకు ప్రాధికారమిచ్చినపుడు, మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించి, అట్టి మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ అవసరమై వున్న ఎవరేని గ్రహీత యొక్క శరీరమునకు మార్పిడి చేయవచ్చును.

(3) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఎవరేని దాత తన మరణమునకు ముందు గ్రహీత పట్ల అభిమానము లేక అనుబంధము కారణముచే లేదా ఏదేని ఇతర ప్రత్యేక కారణము వలన దాతచే నిర్దిష్టపరచబడి తనకు దగ్గర బంధువు కానట్టి గ్రహీతకు తన యొక్క మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ మార్పిడి చేయుటకు ప్రాధికారము ఇచ్చినచో, ప్రాధికారమునొసగు కమిటీ యొక్క పూర్వ ఆమోదము లేకుండా అట్టి మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ తొలగించబడరాదు మరియు మార్పిడిచేయబడరాదు.

(3ఏ) ఉప-పరిచ్ఛేదము (3)లో ఏమియున్నప్పటికినీ,-

(ఎ) తన దగ్గరి బంధువైన గ్రహీతకు తన మరణమునకు ముందు తన మానవ అవయవమును లేక కణజాలమును లేక రెండింటిని దానము చేయుటకు ఎవరేని దాత అంగీకరించినపుడు, అయితే అట్టి దాత గ్రహీతకు జీవసంబంధముగా అనురూపదాత కానపుడు; మరియు

(బి) తన దగ్గరి బంధువైన గ్రహీతకు తన మరణమునకు ముందు తన మానవ అవయవమును లేక కణజాలమును లేక రెండింటిని దానము చేయుటకు రెండవ దాత అంగీకరించినపుడు, అయితే అట్టి దాత గ్రహీతకు జీవ సంబంధముగా అనురూప దాత కానపుడు;

(సి) జీవసంబంధముగా అనురూప దాత <u>యైనట్టి</u> మొదటి దాత రెండవ గ్రహీతకు దాతగా మరియు జీవసంబంధముగా అనురూప దాత<u>యైనట్టి</u> రెండవ దాత మొదటి గ్రహీత కొరకు మానవ అవయవము లేక కణజాలము లేక రెండింటి దాతగా మరియు <u>పైన</u> చెప్పిన దాత మరియు గ్రహీత యొక్క సమూహములోని దాతలిద్దరు మరియు గ్రహీతలిద్దరు సమూహము లోని అట్టి జీవసంబంధ అనురూపమునసరించి అట్టి మానవ అవయవము లేక కణజాలము లేక రెండింటిని దానమిచ్చుటకు మరియు పొందుటకు ఒకే కరారును చేసుకొనినపుడు,

ప్రాధికారమునొసగు కమిటీ యొక్క పూర్వానుమతి లేకుండా <u>పైన</u> చెప్పిన కరారులో నిర్దేశించిన దాని ప్రకారము మానవ అవయవము లేక కణజాలము లేక రెండింటిని తొలగించరాదు లేక మార్పిడి చేయరాదు.

F-4

(4)(ఎ) ప్రాధికారమునొసగు కమిటీల సంరచన, కేంద్ర ప్రభుత్వముచే ఆయా సమయములందు విహితపరచబడునట్లుండును.

(బి) రాజ్య ప్రభుత్వము మరియు సంఘ రాజ్య క్షేత్రములు, ఈ పరిచ్ఛేదము యొక్క ప్రయోజనముల కొరకు అధిసూచనలో నిర్దిష్టపరచబడునట్టి నిబంధనలు మరియు షరతులపై రాజ్య ప్రభుత్వములు మరియు సంఘ రాజ్య క్షేత్రములచే నామనిర్దేశము చేయబడునట్టి సభ్యులతో కూడియున్న ఒకటి లేక అంతకంటే ఎక్కువ ప్రాధికారమునొసగు కమిటీలను ఏర్పాటు చేయవలెను.

(5) దాత మరియు గ్రహీత సంయుక్తముగా విహిత ప్రరూపములో మరియు అట్టి రీతిగా చేసిన దరఖాస్తుపై తగు పరిశీలన జరిపి దరఖాస్తు దారులు ఈ చట్టము మరియు దాని క్రింద చేయబడిన నియమములలోని అన్ని ఆవశ్యకతలను పాటించినారని సంతృప్తి చెందిన పిమ్మట ప్రాధికారమునొసగు కమిటీ దరఖాస్తుదార్లకు, మానవ అవయవమును తొలగించుటకు మరియు మార్పిడి చేయుటకు ఆమోదము తెలుపవలెను.

(6) పరిశీలన జరిపిన పిమ్మట మరియు దరఖాస్తుదార్లకు విన్నవించుకొనుటకు అవకాశము యిచ్చిన పిమ్మట ప్రాధికారమొసగు కమిటీ ఈ చట్టము మరియు దాని క్రింద చేసిన నియమములలోని ఆవశ్యకతలను దరఖాస్తుదార్లు పాటించలేదని సంతృప్తి చెందినచో వ్రాతమూలకముగా రికార్డు చేయు కారణములతో సదరు దరఖాస్తును తిరస్కరించ వలెను.

## అధ్యాయము-3
## ఆసుపత్రుల క్రమబద్ధీకరణ

మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటి తొలగింపు, నిల్వ లేదా మార్పిడి చేయు ఆసుపత్రుల క్రమబద్ధీకరణ.

10.(1) ఈ చట్టపు ప్రారంభమున మరియు అప్పటి నుండి,-

(ఎ) ఈ చట్టము క్రింద రిజిస్టరు చేసుకొనిననే తప్ప, ఏ ఆసుపత్రి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుట, నిల్వ చేయుట లేదా మార్పిడి చేయుటను నిర్వహించరాదు లేదా వాటితో సంబంధము కలిగియుండరాదు లేదా వాటికి సహాయపడరాదు;

(బి) ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడని ఇతర స్థలములో ఏదేని మానవ అవయవములను లేదా కణజాలములను లేదా రెండింటిని తొలగించుట, నిల్వచేయుట లేదా మార్పిడి చేయుటకు సంబంధించిన ఏదేని చర్యను ఏ వైద్య వృత్తిదారు గాని లేదా ఎవరేని ఇతర వ్యక్తిగాని నిర్వహించరాదు లేదా నిర్వహించునట్లు చేయరాదు లేదా తానుగాని ఎవరేని ఇతర వ్యక్తిగాని నిర్వహించుటలో సహాయపడరాదు;

(సి) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్టరైన ఆసుపత్రితో సహా, ఏ స్థలము చికిత్సాపరమైన ప్రయోజనముల నిమిత్తము తప్ప ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుట, నిల్వ చేయుట లేక మార్పిడిచేయు నిమిత్తము ఏ వ్యక్తిగాని ఉపయోగించరాదు లేక ఉపయోగించునట్లు చేయరాదు; మరియు

(డి) కణజాలముల బ్యాంకు, ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయబడిననే తప్ప కణజాలములను తీసుకొనుట, స్క్రీనింగు, పరీక్షించుట, ప్రాసెసింగు, నిల్వ మరియు పంపిణీకి సంబంధించి ఎటువంటి కార్యకలాపమును నిర్వహించరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికినీ, చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు ఎవరేని దాత యొక్క మృతదేహము నుండి ఏ స్థలములోనైనను కళ్లు లేక చెవులు తొలగించవచ్చును.

<u>విశదీకరణ:-</u> ఈ ఉపపరిచ్ఛేదపు ప్రయోజనముల నిమిత్తము "చెవులు" అను పదపరిధిలో చెవి గూబలు మరియు చెవి ఎముకలు చేరియుండును.

చికిత్సాపరమైన ప్రయోజనములకు కాకుండా ఏవేని ఇతర ప్రయోజనముల కొరకు మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటి తొలగింపు లేక మార్పిడిపై నిషేధం

11. ఏ దాతగాని మరియు ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుటకై ప్రాధికారమిచ్చుటకు అధికారముగల ఏ వ్యక్తిగాని, చికిత్సాపరమైన ప్రయోజనాల కొరకు కాకుండా ఇతర ప్రయోజనాల కొరకు ఏదేని మానవ అవయవాన్ని లేదా కణజాలాన్ని లేదా రెండింటిని తొలగించుటకు ప్రాధికారమీయరాదు.

దాతకు మరియు గ్రహీతకు ప్రభావములు మొదలైన వాటిని వివరించుట.

12. ఏ రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు, దాతకు మరియు గ్రహీతకు అవయవాల తొలగింపు, మార్పిడికి సంబంధించి సంభవించగల అన్ని ప్రభావములను, క్లిష్టతలను మరియు సంకటములను గురించి విహితపరచబడునట్టి రీతిలో వివరించిననే తప్ప, ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుట లేక మార్పిడి చేయుట చేపట్టరాదు.

## అధ్యాయము -4
## సముచిత ప్రాధికారి

సముచిత ప్రాధికారి.

13.(1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము అధిసూచన ద్వారా, ఒకరు లేక అంతకంటే ఎక్కువ మంది అధికారులను ప్రతి కేంద్రపాలిత ప్రాంతమునకు సముచిత ప్రాధికారులుగా నియమించవలెను.

(2) రాజ్య ప్రభుత్వము, ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తం అధిసూచన ద్వారా ఒకరు లేక అంతకంటే ఎక్కువ మంది అధికారులను సముచిత ప్రాధికారులుగా నియమించ వలెను.

(3) సముచిత ప్రాధికారి ఈ క్రింది కృత్యములను నిర్వ ర్తించవలెను, అవేవనగా:-

(i) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్ట్రీకరణను మంజూరు చేయుట లేక ఆ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రిజిస్ట్రీకరణను నవీకరించుట;

(ii) 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రీకరణను తాత్కాలికముగా నిలుపుదల చేయుట లేక రద్దు చేయుట;

(iii) విహితపరచబడునట్టి ప్రమాణములను అమలుపరచుటకు,-

(ఏ) ఏదేని మానవ అవయవమును తొలగించుట, నిల్వచేయుట లేదా మార్పిడి చేయుటలో నిమగ్న మైన ఆసుపత్రులకు;

(బీ) కణజాలములను తీసుకొనుట, స్క్రీనింగు, పరీక్షించడం, ప్రాసెసింగు చేయడం, నిల్వ చేయడం మరియు పంపిణీ చేయడంలో నిమగ్న మైన కణజాలముల బ్యాంకులకు;

(iv) ఈ చట్టము యొక్క ఏవేని నిబంధనలు లేక దాని క్రింద చేయబడిన ఏదేని నియమములను భంగపరచుటకు సంబంధించిన ఏదేని ఫిర్యాదును దర్యాప్తు చేయుట మరియు సముచిత చర్యలు తీసుకొనుట;

(ivఏ) నియతకాలికంగా కణజాలముల బ్యాంకులను తనిఖీచేయుటకు;

(v) అవయవముల మార్పిడి పొందిన వ్యక్తులకు జరిపిన అవయవముల మార్పిడి నాణ్యతను మరియు ఎవరి నుండి అవయవములు తొలగించబడినవో ఆ వ్యక్తులకు తదనంతర వైద్య సంరక్షణను పరీక్షించుట కొరకు నియతకాలి-కంగా ఆస్పత్రులను తనిఖీ చేయుట; మరియు

(vi) విహితపరచబడినట్టి ఇతర చర్యలు చేపట్టుట.

సముచిత ప్రాధికార సంస్థకు సలహా ఇవ్వడానికి సలహా కమిటీలు.

13-ఏ.(1) కేంద్ర ప్రభుత్వము మరియు సందర్భానుసారంగా రాజ్య ప్రభుత్వములు సముచిత ప్రాధికార సంస్థ తన కృత్యములను నిర్వ ర్తించుటకు దానికి సలహా మరియు సహాయము అందించుటకుగాను అధిసూచన ద్వారా, రెండు సంవత్సరముల కాలావధికి సలహా కమిటీని సంఘటితము చేయవలెను.

(2) సలహా కమిటీ ఈ క్రింది వారితో కూడి ఉండవలెను,-

(ఎ) సలహా కమిటీ యొక్క ఛైర్-పర్సనుగా నామనిర్దేశము చేయబడు రాజ్య ప్రభుత్వ కార్యదర్శి హోదాకు తక్కువకాని ఒక పరిపాలన నిపుణుడు;

(బి) విహితపరచబడునట్టి అర్హతలను కలిగి ఉన్న ఇద్దరు వైద్య నిపుణులు;

(సి) సభ్య-కార్యదర్శిగా నియోగించబడు ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ లేదా శాఖకు ప్రాతినిధ్యం వహిచుటకై జాయింటు డైరెక్టరు హోదాకు తక్కువ కాని ఒక అధికారి;

(డి) ఉన్నత సంఘ స్థాయి మరియు సమగ్రతకు చెందిన ఇద్దరు సుప్రసిద్ధ సంఘ సేవకులు, వారిలో ఒకరు మహిళల వ్యవస్థ ప్రతినిధుల నుండి ఉండవలెను;

(ఇ) అదనపు జిల్లా న్యాయాధీశుడు లేదా ఆయనకు సమాన స్థాయిలో ఉన్న ఒక శాసనిక నిపుణుడు;

(ఎఫ్) అవయవము లేదా కణజాల దానముల లేదా మానవ హక్కుల రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వేతర వ్యవస్థలు లేదా అసోసియేషనుల ప్రాతినిధ్యం వహించుటకైన ఒక వ్యక్తి;

(జి) మానవ అవయవ మార్పిడి రంగంలో ఉన్న ఒక విశేషజ్ఞుడు, అయితే అతను మార్పిడి బృందంలో సభ్యుడై ఉండరాదు.

(3) సలహా కమిటీ నియామకమునకైన నిబంధనలు మరియు షరతులు కేంద్ర ప్రభుత్వముచే విహితపరచబడునట్లుగా ఉండవలెను.

సముచిత ప్రాధికార సంస్థ అధికారములు. 1908లోని 5వది.

13-బీ. సముచిత ప్రాధికార సంస్థ, ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము, ప్రత్యేకించి ఈ క్రింది విషయములకు సంబంధించి సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద దావాను విచారణ చేయు సివిలు న్యాయస్థానమునకు గల అన్ని అధికరములను కలిగియుండును, అవేవనగా:-

(ఎ) ఈ చట్టపు నిబంధనలను లేదా దాని క్రింద చేసిన నియమములను ఉల్లంఘించడానికి సంబంధించిన ఏదేని సమాచారమును కలిగిఉన్న ఎవరేని వ్యక్తిని సమను చేయుట;

(బి) ఏదేని దస్తావేజును లేదా విషయ వస్తువులను వెల్లడించుట మరియు దాఖలుపరచునట్లు చేయుట;

(సి) మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటిని అనధికారికంగా తొలగించుట, సేకరించుట లేదా మార్పిడి చేయడానికి పాల్పడుతున్నట్లు అనుమానించబడిన ఏదేని ప్రదేశమునకు సోదా వారంటును జారీచేయుట; మరియు

(డి) విహితపరచబడునట్టి ఏదేని ఇతర విషయము.

'F-5

జాతీయ మానవ అవయముల మరియు కణజాలముల తొలగింపు, నిల్వచేయు నెట్ వర్కు.

13-సీ. కేంద్ర ప్రభుత్వము, విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి కృత్యములను నిర్వర్తించుటకు, అధిసూచన ద్వారా ఒక జాతీయ మానవ అవయవములు మరియు కణజాలముల తొలగింపు మరియు నిల్వ చేయు నెట్ వర్క్ ను ఒకటి లేదా మరిన్ని ప్రదేశములలోను మరియు ప్రాంతీయ నెట్ వర్కును స్థాపించవచ్చును.

జాతీయ రిజిస్ట్రీ.

13-డీ. కేంద్ర ప్రభుత్వము మానవ అవయవములు మరియు కణజాలముల దాతలు, గ్రహీతల జాతీయ రిజిస్ట్రీనొకదానిని నిర్వహించవలెను మరియు మానవ అవయవములు, కణజాలముల వైజ్ఞానిక మరియు చికిత్సాపరమైన స్థాయి మదింపును కొనసాగించడానికిగాను అట్టి రిజిస్ట్రీ విహితపరచబడునట్టి సమాచారమును కలిగి ఉండవలెను.

## అధ్యాయము - 5
## ఆసుపత్రుల రిజిస్ట్రీకరణ

మానవ అవయములను లేదా కణజాలములను లేదా రెండింటిని తొలగించుట, నిల్వచేయుట లేక మార్పిడి చేయుటలో నిమగ్నమైయున్న ఆసుపత్రుల రిజిస్ట్రీకరణ.

14.(1) ఈ చట్టము ప్రారంభమైన తరువాత ఏ ఆసుపత్రిగాని (మానవ అవయవముల పునః సంపాదన కేంద్రముతో సహా) చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటినీ తొలగించుట, నిల్వచేయుట లేక మార్పిడి చేయుటకు సంబంధించి ఈ చట్టము క్రింద అట్టి ఆస్పత్రి తగురీతిగా రిజిస్టరు చేయబడిననే తప్ప, ఎట్టి కార్యకలాపమును ప్రారంభించరాదు:

అయితే, ఈ చట్టము ప్రారంభమునకు అవ్యవహిత పూర్వము చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటినీ తొలగించుట, నిల్వచేయుట లేక మార్పిడి చేయుటకు సంబంధించి, ఏదేని కార్యకలాపములో పాక్షికముగాగాని లేక ప్రత్యేకముగాగాని నిమగ్నమైన ప్రతి ఆస్పత్రి అట్టి ప్రారంభపు తేదీ నుండి అరువది దినముల లోపున రిజిస్ట్రీకరణకు దరఖాస్తు చేయవలెను:

అయితే, ఇంకనూ, ఏదేని మానవ అవయమును లేదా కణజాలమును లేదా రెండింటిని తొలగించుట, నిల్వచేయుట లేక మార్పిడి చేయుటకు సంబంధించిన ఏదేని కార్యకలాపములో నిమగ్నమైన ప్రతి ఆస్పత్రి, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి మూడు మాసములు ముగిసిన మీదట అట్టి ఆస్పత్రి రిజిస్ట్రీకరణ కొరకు దరఖాస్తు చేసుకొని అట్లు రిజిస్టరు అయి ఉన్ననే తప్ప లేదా అట్టి దరఖాస్తు పరిష్కరించబడు వరకు, ఏది ముందు అయితే అది, అట్టి ఏదేని కార్యకలాపములో నిమగ్నమగుట నుండి విరమించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్ట్రీకరణ కొరకైన ప్రతి దరఖాస్తును విహిత పరచబడునట్టి ప్రరూపములోను మరియు అట్టి రీతిగాను సముచిత ప్రాధికారికి అందచేయవలెను మరియు ఫీజును జతచేయవలెను.

(3) ఏ ఆసుపత్రియైనను, విహితపరచబడునట్టి ప్రత్యేక సేవలు మరియు సౌకర్యములను సమకూర్చగల స్థితిలో, అట్టి నైపుణ్యము కలిగిన సిబ్బందిని, పరికరాలను కలిగి వున్నదని, అట్టి ప్రమాణాలను నిర్వహించుచున్నదని సముచిత ప్రాధికారి తృప్తిపడిననే తప్ప, ఆ చట్టము క్రింద అట్టి ఆస్పత్రి రిజిస్టరు చేయబడరాదు.

(4) విహితపరచబడునట్టి అర్హతలు మరియు అనుభవము కలిగిన మార్పిడి సమన్వయకర్తను నియామకం చేసినదని ప్రాధికార సంస్థ సంతృప్తి చెందిననే తప్ప, ఏ ఆసుపత్రినిగాని ఈ చట్టము క్రింద రిజిస్టరు చేయరాదు.

కణజాలముల బ్యాంకు రిజిస్ట్రీకరణ.

14.ఏ.(1) మానవ అవయవముల మార్పిడి (సవరణ) చట్టము, 2011 ప్రారంభమయిన తర్వాత, ఈ చట్టము క్రింద కణజాలముల బ్యాంకు తగువిధంగా రిజిస్టరు అయిననే తప్ప కణజాలములను తీసుకొనుట, స్క్రీనింగు, పరీక్ష, ప్రాసెసింగు, నిల్వ చేయడం మరియు పంపిణీలకు సంబంధించి ఏదేని కార్యకలాపమును ఏ కణజాలముల బ్యాంకు ప్రారంభించరాదు:

అయితే, మానవ అవయవముల మార్పిడి (సవరణ) చట్టము, 2011 ప్రారంభానికి అవ్యవహితపూర్వము కణజాలములను తీసుకొనుట, స్క్రీనింగు, పరీక్ష, ప్రాసెసింగు, నిల్వ చేయడం మరియు పంపిణీలకు సంబంధించిన ఏదేని కార్యకలాపములో పాక్షికంగా లేదా ప్రత్యేకంగా నిమగ్నమైన ఏదేని సదుపాయమును అట్టి ప్రారంభపు తేదీ నుండి అరవై రోజుల లోపల కణజాలముల బ్యాంకుగా రిజిస్ట్రీకరణ కొరకు దరఖాస్తు చేసుకొనవలెను.

అయితే ఇంకనూ, అట్టి కణజాలముల బ్యాంకు రిజిస్ట్రీకరణ కొరకు దరఖాస్తు చేసి మరియు ఆవిధముగా రిజిస్ట్రీకరణ జరిగిననే తప్ప లేదా అట్టి దరఖాస్తు పరిష్కరింపబడు నంత వరకు వాటిలో ఏది ముందయితే అప్పటి వరకు, మానవ అవయవముల మార్పిడి (సవరణ) చట్టము, 2011 ప్రారంభమయిన తేదీ నుండి మూడు నెలల గడువు ముగిసిన మీదట ఏవేని అట్టి కార్యకలాపములో అట్టి సదుపాయమును వినియోగించుట కోల్పోవును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్ట్రీకరణ కొరకైన ప్రతి దరఖాస్తును విహిత పరచబడునట్టి ప్రరూపములో మరియు అట్టి రీతిలో మరియు అట్టి రుసుముతోపాటు సముచిత ప్రాధికార సంస్థకు దాఖలు చేయవలెను.

(3) విహితపరచబడునట్టి కణజాలముల బ్యాంకు, అట్టి నైపుణ్యాంగల సేవలు మరియు సదుపాయములను కల్పించుట, అట్టి నైపుణ్యం గల సిబ్బందిని మరియు పరికరములను కలిగి ఉండుట మరియు అట్టి ప్రమాణములను నిర్వహించు స్థాయిలో ఉన్నదని సముచిత ప్రాధికార సంస్థ సంతృప్తిపడిననే తప్ప, ఈ చట్టము క్రింద అట్టి ఏ కణజాలముల బ్యాంకును రిజిస్ట్రీకరణ చేయరాదు.

రిజిస్ట్రీకరణ ధృవపత్రము.

15.(1) సముచిత ప్రాధికారి, పరిశీలన జరిపిన మీదట మరియు ఈ చట్టము యొక్క అన్ని ఆవశ్యకతలను మరియు దాని క్రింద చేయబడిన నియమములను దరఖాస్తుదారు పాటించినాడని సంతృప్తి చెందిన పిమ్మట విహితపరచబడునట్టి షరతులకు లోబడి మరియు అట్టి కాలావధి వరకు అట్టి ప్రరూపములో ఆసుపత్రికి లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకుకు రిజిస్ట్రీకరణ ధ్రువపత్రమును మంజూరు చేయవలెను.

(2) పరిశీలన చేసిన మీదట మరియు విన్నవించుకొనుటకు దరఖాస్తుదారుకు అవకాశమిచ్చిన పిమ్మట, ఈ చట్టము యొక్క ఆవశ్యకతలను మరియు దాని క్రింద చేసిన నియమములను దరఖాస్తుదారు పాటించలేదని సముచిత ప్రాధికారి సంతృప్తి చెందిన యెడల, వ్రాతమూలకముగా రికార్డు చేయబడు కారణములపై, రిజిస్ట్రీకరణ దరఖాస్తును తిరస్కరించవలెను.

(3) ప్రతి రిజిస్ట్రీకరణ ధృవ పత్రము విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి ఫీజును చెల్లించిన మీదట నవీకరించబడవలెను.

రిజిస్ట్రీకరణను తాత్కాలికముగా నిలిపివేయుట లేక రద్దు చేయుట.

16.(1) సముచిత ప్రాధికారి, తనంతతానుగా లేక ఫిర్యాదుపై నోటీసులో తెలిపిన కారణములపై ఈ చట్టము క్రింద చేసిన ఆసుపత్రికి లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకుకు రిజిస్ట్రీకరణను తాత్కాలికముగా ఎందుకు నిలుపుదల చేయరాదో లేక రద్దు చేయరాదో తెలియపరచుమని ఏదేని ఆస్పత్రికి లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకుకు నోటీసు జారీ చేయవచ్చును.

(2) విన్నవించుకొనుటకు ఆసుపత్రికి లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకుకు తగిన అవకాశము యిచ్చిన మీదట, ఈ చట్టము యొక్క ఏదేని నిబంధనలు లేక దాని క్రింద చేయబడిన నియమముల ఉల్లంఘన జరిగినదని సముచిత ప్రాధికారి అభిప్రాయపడిన యెడల, అట్టి ఆసుపత్రిపై లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకుపై తీసుకొనదగిన ఏదేని క్రిమినలు చర్యకు భంగము కలుగకుండా, సముచిత ప్రాధికారి యుక్తమని తలచునట్టి కాలావధి వరకు రిజిస్ట్రీకరణను తాత్కాలికముగా నిలిపివేయవచ్చును లేక దానిని రద్దు చేయవచ్చును:

అయితే, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అట్లు చేయుట అవసరమని లేక ఉపయుక్తమని సముచిత ప్రాధికారి అభిప్రాయపడిన యెడల వ్రాతమూలకమైన కారణములను రికార్డు చేయుట ద్వారా ఏదేని ఆసుపత్రి లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకు యొక్క రిజిస్ట్రీకరణను నోటీసు జారీ చేయకుండానే నిలిపి వేయవచ్చును.

అప్పీళ్లు.

17. 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద దరఖాస్తుకు ఆమోదాన్ని తిరస్కరిస్తూ ప్రాధికారమునొసగు కమిటీ చేసిన ఉత్తరువుచే వ్యధితుడైన ఎవరేని వ్యక్తి, లేక

15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రీకరణ కొరకైన దరఖాస్తును సముచిత ప్రాధికారి తిరస్కరించిన ఉత్తరువు వలన లేక 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రీకరణ నిలుపుదల ఉత్తరువు లేదా రద్దు ఉత్తరువుచే వ్యధితమైన ఏదేని ఆసుపత్రి లేదా సందర్భానుసారముగా కణజాలముల బ్యాంకు ఆ ఉత్తరువు అందిన తేదీ నుండి ముప్పది దినముల లోపల విహితపరచబడినట్టి రీతిలో అట్టి ఉత్తరువుపై,

(i) 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము (ఎ) క్రింద ఏర్పాటు చేయబడిన ప్రాధికారమీయబడిన కమిటీ యొక్క ఉత్తరువుపై లేదా 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియమించబడిన సముచిత ప్రాధికారి యొక్క ఉత్తరువుపై అప్పీలు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వమునకు; లేదా

(ii) 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము (బి) క్రింద ఏర్పాటు చేయబడిన ప్రాధికార కమిటీ యొక్క ఉత్తరువుపై లేదా 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద నియమించబడిన సముచిత ప్రాధికారి యొక్క ఉత్తరువుపై అపీలు చేసినపుడు రాజ్య ప్రభుత్వమునకు

అప్పీలు చేసుకొనవచ్చును.

## అధ్యాయము - 6

## అపరాధములు మరియు శాస్తులు

ప్రాధికారము లేకుండా మానవ అవయమును లేదా కణజాలమును లేదా రెండింటిని తొలగించినందుకు శిక్ష.

18.(1) ఏదేని మానవ అవయవ మార్పిడి ప్రయోజనముల నిమిత్తం ఏదేని ఆసుపత్రికి లేదా ఆసుపత్రిలో తన సేవలను అందించుచు ప్రాధికారము లేకుండా ఏదేని మానవ అవయవ తొలగింపును నిర్వహించుట, దానితో సంబంధము కలిగియుండుట లేదా అందుకు ఏ రీతిగా నైననూ సహాయము చేయు ఏ వ్యక్తియైననూ, పది సంవత్సరముల దాకా ఉండగల కాలావధికి కారావాసముతోను మరియు ఇరవై లక్షల రూపాయల దాకా విస్తరించగల జరిమానాతోను శిక్షింపబడుదురు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద దోషస్థాపితుడైన ఎవరేని వ్యక్తి రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు అయిన యెడల, పరిషత్తు రిజిస్టరు నుండి అతని పేరును మొదటి అపరాధమునకు మూడు సంవత్సరముల కాలావధి వరకును, తదుపరి అపరాధమునకు శాశ్వతముగాను తొలగించుటతో సహా అవసరమైన చర్య తీసుకొనుటకుగాను అతని పేరును సముచిత ప్రాధికారి, రాజ్య వైద్య పరిషత్తుకు నివేదించవలెను.

(3) ప్రాధికారము లేకుండా ఎవరేని వ్యక్తి తన సేవలను మానవ కణజాలములను తొలగించుటలో ఏదేని ఆసుపత్రికి లేదా దాని వద్ద వినియోగించిన మరియు నిర్వహించిన లేదా ఇతరులతో కలిసి పనిచేసిన లేదా ఏ రీతిగానైనను సహాయము చేసినను మూడు

F-6

సంవత్సరముల వరకు ఉండగల కారావాసము తోను మరియు ఐదు లక్షల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను శిక్షించబడదగి ఉండవలెను.

మానవ అవయవము లతో వాణిజ్యపరమైన లావాదేవీలకు శిక్ష

19. ఎవరైతే-

(ఎ) ఏదేని మానవ అవయవమును సరఫరా చేయుటకు లేక దానిని సరఫరా చేయ జూపుటకు ఏదేని చెల్లింపు చేయునో లేక స్వీకరించునో;

(బి) చెల్లింపుపై ఏదేని మానవ అవయవమును సరఫరా చేయుటకు సంసిద్ధతను తెలుపు వ్యక్తిని కనుగొనగోరునో;

(సి) చెల్లింపుపై ఏదేని మానవ అవయవమును సరఫరా చేయజూపునో;

(డి) ఏదేని మానవ అవయవమును సరఫరా చేయుటకు లేక సరఫరా చేయ జూపుటకు సంబంధించిన ఏదేని చెల్లింపుతో కూడిన ఏదేని ఏర్పాటును ప్రారంభించునో లేక దానిని గురించి సంప్రదింపులు జరుపునో;

(ఇ) ఖండము (డి)లో పేర్కొనిన ఏదేని ఏర్పాటును ప్రారంభించునో లేక దానిని గురించి సంప్రదింపులు జరుపు కార్యకలాపములతో కూడియున్న లేక చేరియున్న ఒక సొసైటీగాని ఫర్మ్ గాని లేక కంపెనీగాని అయిన వ్యక్తుల నికాయము యొక్క నిర్వహణ లేక నియంత్రణలో పాల్గొనునో లేక;

(ఎఫ్)(ఎ) చెల్లింపుపై ఏదేని మానవ అవయవమును సరఫరా చేయుటకు వ్యక్తులను ఆహ్వానించుచూ;

(బి) చెల్లింపుపై ఏదేని మానవ అవయవమును సరఫరా చేయజూపుచూ; లేక

(సి) ఖండము (డి)లో పేర్కొనిన ఏదేని ఏర్పాటును ప్రారంభించుటకు లేక దానిని గురించి సంప్రదించుటకు ప్రకటనదారు సంసిద్ధతను తెలుపుచున్నట్లు సూచించుచూ,-

ఏదేని ప్రకటనను ప్రచురించినను లేదా పంపిణీ చేసినను లేదా ప్రచురించుటకు లేదా పంపిణీచేయుటకు పూనుకొనునో,-

(జి) గ్రహీత దగ్గర బంధువుగా లేదా అతని పట్ల అభిమానము లేదా అనుబంధము కారణముగా, దాత మానవ అవయవములను దానము చేయుచున్నట్లు తప్పుడు అఫిడవిట్లు సమర్పించుటతోపాటు తప్పుడు దస్తావేజుల తయారీ లేదా సమర్పణలో ప్రోత్సహించిన యెడల.

అట్టి వ్యక్తి ఐదు సంవత్సరములకు తక్కువకాని అయితే, పది సంవత్సరముల వరకు ఉండగల కారావాసముతో శిక్షించబడవలెను మరియు ఇరవైలక్షల రూపాయలకు తక్కువ కాని, అయితే ఒక కోటి రూపాయల దాకా ఉండగల జుర్మానాకు కూడా పాత్రులగుదురు.

కణజాలములతో అక్రమ లావాదేవీలకు శిక్ష.

19-ఏ. ఎవరైతే-

(ఎ) ఏదేని మానవ కణజాలమును సరఫరా చేయుటకు లేదా సరఫరా చేయజూపుటకు ఏదేని చెల్లింపు చేయునో లేక స్వీకరించునో; లేదా

(బి) చెల్లింపుపై మానవ కణజాలమును సరఫరా చేయుటకు సంసిద్ధతను తెలుపు వ్యక్తిని కనుగొనగోరునో; లేదా

(సి) చెల్లింపుపై ఏదేని మానవ కణజాలమును సరఫరా చేయజూపునో; లేదా

(డి) ఏదేని మానవ కణజాలమును సరఫరా చేయుటకు లేదా సరఫరా చేయ జూపుటకు ఏదేని చెల్లింపుతో కూడిన ఏదేని ఏర్పాటును ప్రారంభించునో లే గా దానిని గురించి సంప్రదింపులు జరుపునో; లేదా

(ఇ) ఖండము (డి)లో పేర్కొనిన ఏదేని ఏర్పాటును ప్రారంభించునో లేక దానిని గురించి సంప్రదింపులు జరుపు కార్యకలాపములతో కూడియున్న లేక చేరియున్న ఒక సంఘముగాని, ఫర్మ్ లేదా కంపెనీగాని అయిన వ్యక్తుల నికాయము యొక్క నిర్వహణ లేక నియంత్రణలో పాల్గొనునో; లేక

(ఎఫ్) ఈ క్రింది విషయములకు సంబంధించి ఏదేని ప్రకటనను ప్రచురించినను లేదా పంపిణీ చేసినను లేదా ప్రచురించుటకు లేదా పంపిణీ చేయుటకు పూనుకొనునో:-

(i) చెల్లింపుపై ఏదేని మానవ కణజాలమును సరఫరా చేయు నిమిత్తము వ్యక్తులను ఆహ్వానించుచూ; లేదా

(ii) చెల్లింపు కొరకు ఏదేని మానవ కణజాలమును సరఫరా చేయ జూపుచూ; లేదా

(iii) ఖండము (డి)లో పేర్కొనిన ఏదేని ఏర్పాటును ప్రారంభించుటకు లేదా దాని గురించి సంప్రదించుటకు ప్రకటనదారు సంసిద్ధతను తెలుపునట్లు సూచించుట; లేదా

(జి) గ్రహీత దగ్గర బంధువుగా లేదా అతని పట్ల అభిమానము లేదా అనుబంధము కారణముగా, దాత మానవ కణజాలములను దానము చేయుచున్నట్లు తప్పుడు అఫిడవిట్లు సమర్పించుటతోపాటు తప్పుడు దస్తావేజుల తయారీ లేదా సమర్పణలో ప్రోత్సహించిన యెడల

అట్టి వ్యక్తి ఒక సంవత్సరమునకు తక్కువకాని అయితే మూడు సంవత్సరముల వరకు ఉండగల కారావాసముతో మరియు ఐదు లక్షల రూపాయలకు తక్కువకాని అయితే, ఇరవై అయిదు లక్షల రూపాయల వరకు ఉండగల జరిమానాతో శిక్షించబడదగి ఉండవలెను.

ఈ చట్టము యొక్క ఏదేని ఇతర నిబంధనను ఉల్లంఘించినందుకు శిక్ష.

20. ఈ చట్టములో ప్రత్యేకముగా శిక్షను గురించి నిబంధన చేయని ఈ చట్టము యొక్క ఏదేని నిబంధనను, దాని క్రింద చేసిన నియమమును లేక రిజిస్ట్రీకరణకు సంబంధించిన ఏదేని షరతును ఉల్లంఘించు వారెవరైననూ ఐదు సంవత్సరముల దాకా ఉండగల కాలావధికి కారాగారవాసముతోను లేక ఇరవై లక్షల రూపాయల దాకా ఉండగల జుర్మానాతోను శిక్షింపబడుదురు.

కంపెనీలచే అపరాధము

21.(1) ఈ చట్టము క్రింద శిక్షింపబడు ఏదేని అపరాధమును ఏదేని ఒక కంపెనీ చేసినచో, ఆ అపరాధము జరిగినపుడు ఆ కంపెనీ యొక్క బాధ్యత లేక ఆ కంపెనీ యొక్క వ్యాపార నిర్వహణ భారమును వహించి దానికై కంపెనీకి ఉత్తరదాయియైయుండిన ప్రతియొక వ్యక్తియు మరియు ఆ కంపెనీయు ఆ అపరాధమును చేసినట్లు భావించవలెను మరియు తదనుసారముగా చర్యలు జరుపబడి శిక్షింపబడుటకు పాత్రులు కావలెను:

అయితే, అట్టి ఎవరేని వ్యక్తి తనకు తెలియకుండా అపరాధము జరిగినదని లేక అట్టి అపరాధము జరుగుటను నివారించుటకు తాను తగిన శ్రద్ధను తీసుకొన్నట్లు అతను రుజువు చేసినచో, ఈ ఉప-పరిచ్ఛేదములోనున్న దేదియు అతనిని ఏ శిక్షకు పాత్రునిచేయదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమున్నప్పటికినీ, ఈ చట్టము క్రింద ఏదేని అపరాధము ఒక కంపెనీ చేసియుండి ఆ అపరాధము ఆ కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి సమ్మతితో లేక మౌనానుకూలతతో జరిగినదని లేక ఏదేని నిర్లక్ష్యము వలన జరిగినదని రుజువైన యెడల అట్టి డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక కంపెనీ యొక్క ఇతర అధికారి కూడా అట్టి అపరాధము చేసినట్లు భావించవలెను మరియు తదనుసారముగా చర్యలు జరుపబడి శిక్షింపబడుటకు పాత్రులు కావలెను.

**విశదీకరణ:-** ఈ పరిచ్ఛేదపు ప్రయోజనము నిమిత్తము,-

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమనికాయము అని అర్థము. ఈ పదపరిధిలో ఫర్మ్ లేక వ్యక్తుల ఇతర అసోసియేషను చేరియుండును; మరియు

(బి) ఫర్మ్‌కు సంబంధించి "డైరెక్టరు" అనగా ఫర్మ్‌లోని భాగస్వామి అని అర్థము.

అపరాధముల సంజ్ఞానము.

22.(1) ఈ చట్టము క్రింద ఏ న్యాయస్థానము గాని అపరాధమును-

(ఎ) సంబంధిత సముచిత ప్రాధికారి, లేదా కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వము ఈ విషయమై ప్రాధికారమొసగిన ఎవరేని అధికారి లేదా సందర్భానుసారము సముచిత ప్రాధికారి; లేదా

(బి) ఆరోపిత అపరాధమును గురించి మరియు న్యాయస్థానమునకు ఫిర్యాదు చేయవలెనను తన ఉద్దేశ్యమును గురించి సంబంధిత సముచిత ప్రాధికారికి విహిత రీతిలో అరువది దినములకు తక్కువకాని నోటీసు ఇచ్చిన ఎవరేని వ్యక్తి

ఫిర్యాదు చేసిననే తప్ప సంజ్ఞానము చేయరాదు.

(2) మహానగర మేజిస్ట్రేటు లేదా మొదటి తరగతి న్యాయిక మేజిస్ట్రేటు న్యాయ స్థానము కానట్టి ఏ ఇతర న్యాయస్థానము ఈ చట్టము క్రింద శిక్షింపదగిన ఏదేని అపరాధ-మును విచారణ చేయరాదు.

(3) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (బి) క్రింద ఫిర్యాదు చేయబడిన యెడల, అట్టి వ్యక్తి అభ్యర్థనపై తన స్వాధీనమునందున్న సంబంధిత రికార్డుల ప్రతులను అట్టి వ్యక్తికి లభ్యమగునట్లు చేయవలసినదని సముచిత ప్రాధికారిని న్యాయస్థానము ఆదేశించవచ్చును.

## అధ్యాయము - 7
## వివిధ విషయములు

సద్భావముతో చేసిన చర్యకు రక్షణ.

23.(1) ఈ చట్టము యొక్క నిబంధనలననుసరించి సద్భావముతో చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన దేనికైనను ఎవరేని వ్యక్తిపై ఎట్టి దావా, అభియోగము లేక ఇతర శాసనిక చర్య ఉండదు.

(2) ఈ చట్టపు నిబంధనలననుసరించి సద్భావముతో చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన దేనివలననైనను కలిగిన లేక కలుగగల ఏదేని నష్టముకై కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వముపై ఎట్టి దావా, లేక ఇతర శాసనిక చర్య ఉండదు.

నియమములు చేయుటకు అధికారము.

24.(1) ఈ చట్టము యొక్క ప్రయోజనములన్నింటిని గాని లేక వాటిలో వేటినైనను గాని నెరవేర్చుటకు కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించి, మరియు పైన చెప్పబడిన సాధరణ అధికారమునకు భంగము వాటిల్లకుండాను అట్టి నియమములు ఈ క్రింది అన్నింటి లేక వేటి కొరకైనను నిబంధన చేయవచ్చును, అవేవనగా:-

(ఎ) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఎవరేని దాత, తన మరణము నకు ముందుగా తన శరీరములోని ఏదేని మానవ అవయవమును లేదా కణజాలమును లేదా రెండింటిని తొలగించుటకు ప్రాధికారమీయవలసిన రీతి, షరతులు;

(ఎఎ) మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటి విషయములో రిజిస్ట్రీకృత వైద్యవృత్తిదారునిపై కర్తవ్య నిర్వహణ ఒసగబడినపుడు, 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1-ఎ) యొక్క ఖండము (i) క్రింద ప్రాధికారమునొసగుట కొరకు డాక్యుమెంటేషను పొందు రీతి;

F-7

(ఎబి) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1-ఏ) యొక్క ఖండము (ii) క్రింద దాతకు లేదా అతని బంధువుకు అవగాహనను కలిగించు రీతి;

(ఎసి) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1-ఏ) యొక్క ఖండము (iii) క్రింద మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటి పునః సంపాదన కేంద్రమునకు తెలియజేయు రీతి;

(ఎడి) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1-బీ) క్రింద రిజిస్ట్రీకరణ చేయబడని ఆసుపత్రిలో పనిచేయుచున్న రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారునికి ఉప-పరిచ్ఛేదము (1-ఏ)లో పేర్కొనబడిన కర్తవ్యములు వర్తించదగు తేదీ;

(ఎఇ) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4)కు గల వినాయింపు క్రింద సాంకేతిక నిపుణుని అర్హతలు మరియు అనుభవము;";

(బి) "మస్తిష్క మూల మరణము"ను ధృవీకరించవలసిన ప్రరూపము మరియు రీతి మరియు 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింది ప్రయోజనముల కొరకు పాటించవలసిన షరతులు మరియు ఆవశ్యకతలు;

(బిఎ) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) యొక్క ఖండము (iii)కు గల వినాయింపు క్రింద వైద్య నిపుణుల మండలిలో చేర్చబడదగు సర్జను లేదా ఫిజీషియను మరియు అనెస్తిటిస్టు లేదా ఇన్టెన్సివిస్టు యొక్క నామనిర్దేశము కొరకైన షరతులు;

(సి) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (7) క్రింద ఒక మైనరు యొక్క "మస్తిష్క మూల మరణము" విషయములో ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటినీ తొలిగించుటకుగాను తల్లి లేక తండ్రి ఎవరైనను ఇవ్వవలసిన ప్రాధికారపు ప్రరూపము మరియు రీతి;

(డి) 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, ఆసుపత్రి లేదా కారాగారపు నిర్వహణ లేదా నియంత్రణకు ఇన్-ఛార్జిగానున్న వ్యక్తి, ఎవరూ క్లైయిము చేయని మృతదేహము నుండి ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటినీ తొలగించుటకు ప్రాధికారమును ఇవ్వవలసిన ప్రరూపము;

(ఇ) 7వ పరిచ్ఛేదము క్రింద ఎవరేని వ్యక్తి యొక్క దేహము నుండి తొలగించిన మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండునూ భద్రపరచుటకు తీసుకొనదగు చర్యలు;

(ఇఎ) 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1-బీ) క్రింద మార్పిడి కొరకు, మైనరు మరణమునకు పూర్వము, అతని దేహము నుండి మానవ అవయవములు లేదా కణజాలములు లేదా రెండింటిని తొలగించు రీతి;

(ఇబి) 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద ప్రాధికారమునొసగు కమిటీల సంరచన;

(ఎఫ్) 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (5) క్రింద దాత మరియు గ్రహీత సంయుక్తంగా చేయవలసిన దరఖాస్తు యొక్క ప్రరూపము మరియు రీతి;

(జి) తొలగింపు మరియు మార్పిడికి సంబంధించి సంభవించగల ప్రభావములను, క్లిష్టతలను మరియు సంకటములను రిజిస్ట్రీకృత వైద్య వృత్తిదారు 12వ పరిచ్ఛేదము క్రింద దాత మరియు గ్రహీతకు వివరించవలసిన రీతి;

(హెచ్) 13వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3)లోని ఖండము (iii) క్రింద ఏదేని మానవ అవయవము లేదా కణజాలము లేదా రెండింటిని తొలగించుట, నిల్వచేయుట లేదా మార్పిడి చేయుటలో నిమగ్నమైన ఆసుపత్రుల యొక్క సముచిత ప్రాధికారి అమలు పరచబడదగిన ప్రమాణములు;

(ఐ) 13వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3)లోని ఖండము (vi) క్రింద తన కృత్యములను నిర్వర్తించుటలో సముచిత ప్రాధికారి చేపట్టవలసిన ఇతర చర్యలు;

(ఐఏ) 13ఏ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2) మరియు (3)ల క్రింద సలహా కమిటీకి నియామకము కొరకు వైద్యనిపుణుల అర్హతలు మరియు షరతులు మరియు నిబంధనలు;

(ఐబి) 13బీ పరిచ్ఛేదము యొక్క ఖండము (డి) క్రింద ఏదేని ఇతర విషయములో సముచిత ప్రాధికారి యొక్క ప్రాధికారము;

(ఐసి) జాతీయ మానవ అవయవములు మరియు కణజాలముల తొలగింపు మరియు నిల్వచేయు నెట్ వర్కు మరియు ప్రాంతీయ నెట్ వర్కును స్థాపించు రీతి మరియు 13-సీ పరిచ్ఛేదము క్రింద అవి నిర్వర్తించదగు కృత్యములు;

(ఐడి) మానవ అవయవములు మరియు కణజాలముల దాతలు మరియు గ్రహీతల యొక్క జాతీయ రిజిస్టరులోని సమాచారము మరియు 13డీ పరిచ్ఛేదము క్రింది సమాచారము అంతయు;

(జె) 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రీకరణ కొరకు పెట్టుకొనవలసిన దరఖాస్తు ప్రరూపము, రీతి మరియు దానికి జతపరచవలసిన ఫీజు;

(కె) 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రిజిస్ట్రీకరణ కొరకు ఆసుపత్రి సమకూర్చవలసిన ప్రత్యేకమైన సేవలు మరియు సౌకర్యములు, నైపుణ్యము

కలిగిన సిబ్బంది, కలిగి ఉండవలసిన పరికరములు మరియు నిర్వహించ వలసిన ప్రమాణములు;

(కెఎ) 14వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (4) క్రింద మార్పిడి సమన్వయకర్త యొక్క అర్హతలు మరియు అనుభవము;

(కెబి) 14-ఏ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రీకరణ కొరకైన దరఖాస్తు ప్రరూపము, రీతి, మరియు దానికి జతపరచవలసి యుండునట్టి రుసుము;

(కెసి) 14-ఏ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (3) క్రింద కణజాలముల బ్యాంకు ద్వారా సమకూర్చబడదగు ప్రత్యేకతలు కలిగిన సేవలు మరియు సౌకర్యములు, నిపుణతగల మానవ శక్తి కలిగిఉండవలసిన సాధన సామగ్రి మరియు అది పాటించవలసియుండునట్టి ప్రమాణములు;

(ఎల్) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఆసుపత్రికి లేదా కణజాలముల బ్యాంకుకు ఏయే షరతులకు లోబడి రిజిస్ట్రీకరణ ధ్రువ పత్రమును మంజూరు చేయవలసిన ప్రరూపము, కాలావధి;

(ఎమ్) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రిజిస్ట్రీకరణ ధృవపత్రమును నవీకరించవలసిన రీతి మరియు చెల్లించవలసిన ఫీజు;

(ఎన్) 17వ పరిచ్ఛేదము క్రింద అపీలు చేయవలసిన రీతి;

(ఒ) 22వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (బి) క్రింద ఆరోపిత అపరాధమును గురించి మరియు న్యాయస్థానమునకు ఫిర్యాదు చేయవలెనను తన ఉద్దేశ్యమును గురించి ఒక వ్యక్తి సముచిత ప్రాధికారికి నోటీసు ఇవ్వవలసిన రీతి; మరియు

(పి) విహిత పరచబడవలసిన లేక విహిత పరచబడదగిన అవసరమైనట్టి ఏదేని ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా పార్లమెంటు అధివేశనములో ఉన్నప్పుడు, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతి యొక సదనము సమక్షమున ఉంచవలెను. అట్టి కాలావధి ఒకే అధివేశనములోగాని, వరుసగా వచ్చు రెండు లేక అంతకంటే ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండ వచ్చును, మరియు పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వము

ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో, లేక ఆ నియమము చేయబడరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పు చేయబడిన ప్రరూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారంగా అది ఎట్టి ప్రభావాన్ని కలిగియుండదు, అయినప్పటికినీ, అట్టి ఏదేని మార్పుగాని, రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేసియుండినదేని శాసనమాన్యతకైనను భంగం కలిగించదు.

రద్దు మరియు వ్యావృత్తులు. 1982లోని 28వది. 1982లోని 29వది.

25.(1) చెవి గూబలు మరియు చెవి ఎముకల (చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు ఉపయోగించు ప్రాధికారము) చట్టము, 1982 మరియు కళ్ల (చికిత్సాపరమైన ప్రయోజనముల కొరకు ఉపయోగించు ప్రాధికారము) చట్టము, 1982లను ఇందుమూలముగా రద్దు చేయడమైనది.

(2) ఈ రద్దు, అట్లు రద్దు చేయబడిన లేక తగువిధముగా చేయబడిన ఏదేని లేక దానిచే వ్యర్థకు గురియైన చట్టముల పూర్వ అమలును భంగపరచదు.

F-8